క్లుప్తంగా

గాయత్రీ మాతకు ప్రత్యేక పూజలు



ఆస్పరి: మండల కేంద్రం సమీపంలోని రామతీర్థంలో వెలసిన గాయత్రీ మాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో నిర్వాహకులు రూపామోహన్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు అమ్మవారిని దర్శించకుని మొక్కులు తీర్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో మద్దమాంబ ఊరేగింపు



మద్దికెర : స్థానిక మద్దమాంబ ఆలయంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం గ్రామానికి 4 కి.మీ దూరంలోనున్న మద్దమ్మ అమ్మవారి పాదాల వద్ద పూజలు చేపట్టి ఆచారం ప్రకారం కలశాలతో నీటిని ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయంలో అమ్మవారికి అభిషేకం చేశారు. అలాగే కుంకుమార్చన, మహామంగళహారతి తదితర కార్యక్రమాలు జరిపించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బంగారు ముక్కెర, చంద్రవంక విరాళం



ముక్కెర, చంద్రవంకను అందజేస్తున్న పారా విశ్వనాథ్

మద్దికెర : మండలంలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథస్వామి దేవాలయంలో కొలువైన శ్రీరాజ్యలక్ష్మి అమ్మవారికి పారా రామచంద్రప్రసాద్ సోదరి డాక్టర్ జయలక్ష్మి, రవీంద్రనాథ్ అందజేసిన 5.338 గ్రాముల బంగారు ముక్కెర, 4.620 గ్రాముల బంగారు చంద్రవంకను వారి కుటుంబీకులు పారా విశ్వనాథ్ అర్చకులు రంగస్వామికి శుక్రవారం అందజేశారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ శివశంకర్

హాలహర్వి: మండలంలోని మెదేహాల్ గ్రామంలో అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఏఓ శివశంకర్ శుక్రవారం పరిశీలించారు. దెబ్బతిన్న వరి పొలాలను సందర్శించి నివేదికలను ప్రభుత్వానికి పంపుతామని ఏఓ చెప్పారు. అధిక వర్షాల వల్ల మండలంలో చాలా వరకు పంటలు దెబ్బతిన్నాయని, వాటిని పరిశీలించి నష్టపరిహార నివేదికలను తయారు చేస్తామని చెప్పారు. వీఆర్ఏ, ఎంపీఈఓ సూరన్న ఉన్నారు.

విద్యతో పాటు క్రీడలు అవసరం



బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ విజయ్‌కుమార్‌నాయక్

మద్దికెర : విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు అవసరమని మద్దికెర ఎస్ఐ విజయ్‌కుమార్‌నాయక్ అన్నారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ 89వ వార్షికోత్సవం సందర్భంగా జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు కబడ్డీ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. ఎస్ఐ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో రాణించాలంటే మానసిక ఒత్తిడిని అధిగమించాలని, అది క్రీడలతోనే సాధ్యపడుతుందన్నారు. ప్రధానోపాధ్యాయుడు అజరయ్యబాబు, ఉపాధ్యాయులు రఫీ, నరేంద్ర, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



దేవనకొండ బీసీ కాలనీలో నెలకొన్న అపరిశుభ్రతను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

దేవనకొండ: ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రభుత్వ ఆస్పత్రి సబ్ యూనిట్ ఆఫీసర్ సాయిబాబా సూచించారు. శుక్రవారం స్థానిక బీసీ కాలనీలో శుక్రవారం ఫ్రైడే- డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది కాలనీలోని ఇళ్ల వద్దకు వెళ్లి ఎక్కువ కాలం డ్రమ్ములు, నీటితొట్టెల్లో ఉన్న నీటిని పారబోయించారు. సూపర్‌వైజర్లు రంగస్వామి, హనుమమ్మ, జయలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సేవ చేయాలని వచ్చాం..



కోల్‌కతా వైద్యురాలి ఘటన తీవ్రంగా కలిచివేసింది. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలి. అధికారులు కూడా మేలుకోవాలి. మిగిలిన రాష్ట్రాల్లో మహిళా వైద్యులు, సిబ్బందికి అండగా నిలవాలి. అన్ని వసతులు కల్పించడంతో పాటు రక్షణ ఇవ్వాలి. ప్రజలకు సేవ చేయాలని వచ్చాం. కొన్ని సంఘటనలు చూసినప్పుడు, విన్నప్పుడు అభద్రత భావానికి లోనవుతాం. అలాంటివి ఎక్కడా జరగకుండా రక్షణ ఇవ్వాలని కోరుతున్నాం.

– రేష్మా, డాక్టర్, మొలగవల్లి పీహెచ్‌సీ

పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలి



సీహెచ్‌సీలో వైద్యులకు, ప్రధానంగా మహిళా వైద్యులకు, స్టాఫ్ నర్సులకు రక్షణ కల్పించాలి. నైట్ డ్యూటీలో ఉన్నప్పుడు విశ్రాంతి తీసుకోవడం సహజం. కనుకు మాకు ప్రత్యేక గదులు కేటాయించాలి. రాత్రి పూట విధులు నిర్వర్తించే సమయంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలి. మద్యం మత్తులో ఉండే వారిని, ఇతరులను ఆసుపత్రిలోకి అనుమతించకుండా ప్రధాన గేటు వద్ద పోలీసులు ఉండేలా చూడాలి.

– వాహిద్ ,డాక్టర్,ఆలూరు సీహెచ్‌సీ



హొళగుందలో ఫిల్టర్‌బెడ్‌లోకి పంపింగ్ కాని నీరు



కోటవీధిలో నీటికోసం కుళాయిల వద్ద మహిళల పడిగాపులు

హొళగుందలో దాహం కేకలు

హొళగుంద: స్థానిక ఫిల్టర్‌బెడ్‌కు నీటి సరఫరా లేక పోవడంతో మండల కేంద్రంలో దాహార్తితో ప్రజలు అల్లాడుతున్నారు. ఎల్లెల్సీలో పుష్కలంగా నీరున్నప్పటికీ మంచినీటి ఎద్దడి తలెత్తుతుండటంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తరుచూ ఫిల్టర్‌బెడ్‌కు నీటి సరఫరా నిలిచిపోతుండడంతో గ్రామంలో నీటి ఎద్దడి నెలకొంటుంది. కడ్లమాగి వద్ద నిర్మించిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నుంచి హొళగుందలో ఉండే ఫిల్టర్‌బెడ్‌కు నీటిని పంపించి అక్కడి నుంచి గ్రామంలో సరఫరా చేస్తారు. అయితే నీటి పంపింగ్ విషయంలో సమస్యలు, ఇతర లోపాలు, విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, సిబ్బంది నిర్లక్ష్యం లాంటి సమస్యల కారణంగా అక్కడి నుంచి ఫిల్టర్‌బెడ్‌కు నీటిని పంపింగ్ చేసేందుకు సమస్యగా మారింది. ఫిల్టర్‌బెడ్‌లో నీరు లేకపోవడంతో గ్రామానికి నీటి సరఫరా నిలిచిపోతుంది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని వార్డులో నీటి కోసం కుళాయిల వద్ద రాత్రంతా పడిగాపులు కాస్తుంటే మరికొన్ని వార్డులో పగటి సమయంలో వచ్చే నీటి కోసం పనులకు, పొలాలకు వెళ్లకుండా ఇంటి వద్దే ఉండాల్సిన పరిస్థితి దాపురించిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పర్యావరణాన్ని రక్షిద్దాం

హొళగుంద: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పెద్దహ్యాట పాఠశాల హెచ్ఎం అంజునాయక్ అన్నారు. శుక్రవారం ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో ఎస్ఎంసీ చైర్మన్ రాము, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పెద్యాట శ్రీరంగ, గ్రామపెద్దలు విరూపాక్షి, సోమశేఖర్‌గౌడ్, గోపాల్, వీరభద్ర తదితరులతో కలిసి మొక్కలు నాటారు.

కట్రవంక పరిశీలన



రహదారి దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి

హాలహర్వి: మండలలోని చింతకుంట–బళ్లారి రహదారిలోని కట్రవంకను శుక్రవారం ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి పరిశీలించారు. రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు వంక ఉధృతంగా ప్రవహించడంతో రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో ఎమ్మెల్యే పరిశీలించి, సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రోడ్డు కొట్టుకుపోవడంతో బళ్లారి–చింతకుంట గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

దేవనకొండ: ఆలూరు నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే బి.విరూపాక్షి పేర్కొనారు. శుక్రవారం మండలంలోని సింగాపురం గ్రామంలో ఓ వివాహ కార్యక్రమానికి హాజరైన ఆయన అనంతరం కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. కార్యకర్తల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వంలో ఎదురవుతున్న కష్టాలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. జెడ్పీటీసీ రామకృష్ణ, మండల కన్వీనర్ తపాల శ్రీనివాసులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హాలహర్వి పోలీస్‌స్టేషన్ తనిఖీ



స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాసనాయక్

హాలహర్వి: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసనాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, పెండింగ్ కేసుల వివరాలపై ఎస్ఐ చంద్రను ఆరా తీశారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. కర్ణాటక సరిహద్దు కావడంతో నాటుసారా, మట్కా, కర్ణాటక మద్యం సరఫరా ఎక్కువగా జరుగుతుంటుందని, ప్రత్యేక నిఘా ఉంచాలని సీఐ సూచించారు. కానిస్టేబుళ్లు గోవర్దన్, రంగానాయక్, రాజశేఖర్ ఉన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు



ట్రాక్‌ను పరిశీలిస్తున్న రైల్వే అధికారులు

మద్దికెర : రైల్వే బ్రిడ్జి కింద నిలిచిన నీటిని పంపింగ్ చేసి రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటామని రైల్వే పీడబ్ల్యూఓ భరత్, ఐడబ్ల్యూఓ మధుబాబు శుక్రవారం తెలిపారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు స్థానిక దర్గా వద్ద నున్న రైల్వే బ్రిడ్జి కింద నీరు నిలిచి రైతులు పొలాలు వెళ్లడానికి ఇబ్బందులు పడుతుండటాన్ని రైతులు రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ట్రాక్, బ్రిడ్జిని పరిశీలించారు. వెంటనే పైపులు ఏర్పాటు చేసి నీటిని పక్కకు మళ్లిస్తామని చెప్పారు. జరుగుతుందన్నారు. శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను కోరారు.

వ్యసనాలతో జీవితం నాశనం

కృష్ణగిరి: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు బానిస అవుతున్నారని, చెడు వ్యసనాలకు లోనైతే వారి బంగారు భవిష్యత్ అంధకారం అవుతుందని ఎస్ఐ మల్లికార్జున అన్నారు. స్థానిక మోడల్‌స్కూల్, కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. కళాశాలలు, ఇతర ప్రాంతాల్లో డ్రగ్స్ సేవిస్తున్నా, విక్రయిస్తున్న సమాచారం తమకు తెలియజేస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాళ్లు నిర్మలాకుమారి, చైతన్యస్రవంతి, ఏఎస్ఐ ఉమ్లా నాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

ఆస్పరి: విద్యా సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమమ్యాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శరత్‌కుమార్ విమర్శించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో ఏఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ విద్యారంగ కాషాయికరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టే ఉద్యమాల్లో విద్యార్థులు పాల్గొనాలని కోరారు. ఈశ్వర్, మహేష్, కార్తీక్, నవీన్ పాల్గొన్నారు.

వసతి గృహం తనిఖీ

తుగ్గలి: మండలంలోని పెండేకల్లు రైల్వే జంక్షన్‌లోని ఎస్సీ హాస్టల్‌ను శుక్రవారం ఎంపీడీఓ సావిత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లోని గదులు, వంటశాలను పరిశీలించారు. రోజువారీ అందుతున్న మెనూపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వార్డన్ సుంకన్నకు సూచించారు. ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీ గోపాల్, ఎంఈవో–2 రామవెంకటేశ్వర్లు ఉన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ భారతి

పత్తికొండ(తుగ్గలి) : వచ్చే నెల 14వ తేదీన నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ భారతి పిలుపునిచ్చారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ.. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు స్థానిక జూనియర్ కోర్టులో మండల న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ లోక్‌అదాలత్ సందర్భంగా న్యాయవాదులు రాజీపడ దగిన కేసులను గుర్తించి కక్షిదారులతో మాట్లాడి వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి, ప్రధాన కార్యదర్శి మహేష్, కోశాధికారి రాజశేఖర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆర్డీఓ విచారణ



వెల్దుర్తిలో హోలియ దాసరికి చెందిన కుటుంబాలతో మాట్లాతున్న ఆర్డీఓ శేషిరెడ్డి

వెల్దుర్తి: మండల కేంద్రానికి చెందిన హోలియ దాసరికి చెందిన 48 కుటుంబాలు తమ కుల ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకోవడంతో వాటిపై కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. ఆయన వారి ఇళ్లకు వెళ్లి వృత్తి, గతంలో వారికి అందించిన కుల ధ్రువ పత్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో తమ పిల్లల చదువులకు ఇబ్బందులు పడుతున్నామని ఆర్డీవోకు విన్నవించారు. తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ ఉన్నారు.



కలుగొట్లలో మాట్లాడుతున్న ఎస్ఐ జి.అశోక్

గ్రామాల్లో ప్రశాంతంగా జీవించండి

వెల్దుర్తి: గ్రామాల్లో పంతాలు పట్టింపులకు పోకుండా ప్రశాంతంగా జీవించాలని ఎస్ఐ జి.అశోక్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కలుగొట్ల గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఆయన గ్రామస్తులకు అసాంఘిక కార్యకలపాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. తమ పిల్లలను మంచి చదువులు చదివించాలని సూచించారు. చదువు ఉన్నప్పుడే గ్రామాల్లో అంటరానితనం రూపుమాపుతుందన్నారు. ఎన్నికలు ముగియడంతో అందరు పార్టీలకు అతీతంగా మెలగి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



కృష్ణగిరి పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎల్. భాస్కర్

కృష్ణగిరి: వైద్యులు బాధ్యతాయుతంగా రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎల్. భాస్కర్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు, హాజరు, ఐఎల్ఆర్, ల్యాబ్, ఫార్మసీని పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్ హెచ్ఎర్రగుడి గ్రామంలో 104 ద్వారా అందిస్తున్న సేవలను, గ్రామంలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ప్రదీప్, శ్రీవాణి, ఆరోగ్య విస్తరణ అధికారి గజేంద్రరెడ్డి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దొంగ అరెస్ట్

- మూడు బైక్‌లు, ఆటో రికవరీ
- రూ.20 వేల నగదు కూడా..



స్కూటర్లు స్వాధీనం చేసుకుని దొంగ అరెస్టు చూపుతున్న పోలీసులు

ఆలూరు రూరల్: ఆలూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో దొంగతాలకు పాల్పడిన భాస్కర్ ఆచారి అనే దొంగను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నరసింహులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన ఆలూరు పోలీసు స్టేషన్ ఆవరణలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు నాయక్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. అనంతపురం జిల్లా విడపనకల్లు మండలం కడదరబెంచి గ్రామానికి చెందిన భాస్కర్ ఆచారి ఆలూరు సర్కిల్ పరిధిలో 2023–2024 ఏడాదిలో వివిధ ఆలయాల్లో హుండీలోని సొమ్ము, గంటలు, మూడు స్కూటర్లు దొంగలించాడని చెప్పారు. శుక్రవారం ఆలూరు–మొలగవల్లి రోడ్డులో ఉండగా అరెస్టు చేసి మూడు బైక్‌లు, ఒక ఆటోతో పాటు రూ.20 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు వివరించారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం



మద్యాన్ని ధ్వంసం చేయిస్తున్న వినోద్‌కుమార్

పత్తికొండ(తుగ్గలి) : వివిధ కేసుల్లో పట్టుబడిన అక్రమ మద్యాన్ని పట్టణ సమీపంలోని బైపాస్ రోడ్డులో శుక్రవారం సెబ్ పోలీసులు ధ్వంసం చేశారు. సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో 429 లీటర్ల నాటుసారా, 1,430 లీటర్ల బెల్లం ఊట, 9,018 లీటర్ల మద్యం, 16.9 లీటర్ల బీర్ బాటిళ్లను ధ్వంసం చేశారు. అనుమతి లేకుండా మద్యం బాటిళ్లు తెచ్చి విక్రయించినా, బెల్ట్‌షాపులు నిర్వహించినా, సారా తయారు చేసి అమ్మినా సహించేది లేదన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సెబ్ సీఐ స్వర్ణలత, సిబ్బంది పాల్గొన్నారు.

టంగుటూరి సేవలు ఎనలేనివి



మాట్లాడుతున్న సి.నరసింహులు

ఆలూరు: ఆంధ్రరాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు సేవలు ఎనలేనివని అరికెర గ్రామంలోని అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సి.నరసింహులు పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో టంగుటూరి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల అర్పించారు. అనంతరం స్వాతంత్ర్య సమయంలో ఆయన పాత్రను వివరించారు. వైఎస్ ప్రిన్సిపాల్ సుధాకర్ రాజు,ఉపాధ్యాయులు ప్రదీప్ కుమార్,మనోజ్ రాజు,పీడీ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వేదావతిలో తగ్గిన వరద



మార్లమడికి వద్ద నదిలో వరద తగ్గడంతో రాకపోకలు సాగిస్తున్న దృశ్యం

హొళగుంద: ఆంధ్ర–కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులోని మార్లమడికి వద్ద ఉన్న వేదావతి (హగరి) నది శాంతించడంతో ఇరు రాష్ట్రాల మధ్య రాకపోకలు పునః ప్రారంభమైయ్యాయి. కొద్ది రోజులుగా నది పరివాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు నదిలో వరద ఉధృతి కారణంగా వంతెనపై నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో శుక్రవారం ఉదయం నుంచి రాకపోకలు మళ్లీ మొదలయ్యాయి. దీంతో ప్రయాణికులకు ప్రయాణ ఇక్కట్లు తప్పాయి.

ప్రజలకు ఉపయోగపడే పనులను గుర్తించాలి



పత్తికొండ గ్రామ సభలో వినతి పత్రం అందజేస్తున్న వార్డు సభ్యులు



హొళగుంద గ్రామసభలో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ నాగేంద్రప్రసాద్

పత్తికొండ(తుగ్గలి) : ప్రజలకు, రైతులకు ఉపయోగపడే పనులను గుర్తించాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో ఉపాధి గ్రామ సభలు నిర్వహించారు. సర్పంచ్ కొమ్ము దీపిక అధ్యక్షతన పట్టణంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధి హామీ పనులతో గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. గ్రామసభల్లో ప్రజల ఆమోదంతో పనులు గుర్తించాలని చెప్పారు.

మద్దికెర : ఉపాధి హామీ పథకం కింద గ్రామంలో కలిసికట్టుగా రాజకీయాలకతీతంగా గ్రామాభివృద్ధి చేసుకుందామని ఎంపీడీఓ నరసింహమూర్తి, జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ అనిత అన్నారు. శుక్రవారం స్థానిక పంచాయతీ ఆవరణలో సర్పంచ్ సుహాసిని అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో సర్పంచుల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించామని ఎంపీడీఓ తెలిపారు. ఈఓ శివకుమార్, మాజీ జెడ్పీటీసీ రాజన్న, మాజీ ఎంపీపీ మల్లికార్జున పాల్గొన్నారు.

తుగ్గలి : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం అధికారులు ఉపాధి గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సభల్లో మరుగుదొడ్లు, విద్యుత్తు, కుళాయి, వంటగ్యాస్ కనెక్షన్లు, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ వీధి దీపాలు, సిమెంటు రోడ్లు, లింక్‌రోడ్ల నిర్మాణాలు, ఇంకుడు గుంతలు, పంట కుంటల నిర్మాణం, ఉద్యానవన, పట్టు పరిశ్రమ, అభివృద్ధికి సదుపాయాలు, పశువుల పెంపకం, షెడ్ల నిర్మాణాలు తదితర పనుల నిర్వహణపై చర్చించారు. కూలీల సమస్యలు పరిష్కరించాలని చెన్నంపల్లిలో, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నబిర సూల్, ఉప్పర్లపల్లిలో శ్రీరాములు వినతి పత్రం అందజేశారు. ఎంపీడీఓ సావిత్రి, ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీ గోపాల్, ఏపీఓ రామకృష్ణ, సర్పంచ్‌లు రంగమ్మ, సౌజన్య, లక్ష్మీదేవి, లక్ష్మి, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చిప్పగిరి:మండలోని గ్రామాల్లో ఉపాధి హామి పనుల పై అయా గ్రామాల ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మీనాక్షినాయుడు మండల అధికారులను కోరారు. శుక్రవారం మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు.

ఆస్పరి: మండలంలోని 21 గ్రామ పంచాయతీలలో శుక్రవారం అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. ఆస్పరిలో సర్పంచ్ మూలింటి రాధమ్మ అధ్యక్షతన నిర్వహించిన సభలో మండల ప్రత్యేక అధికారి నాగేశ్వరరావు, తహసీల్దార్ శివశంకర్‌నాయక్, ముత్తుకూరులో ఎంపీడీఓ రాణెమ్మ పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో ప్రజా సంఘాల నాయకులు అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు.

కృష్ణగిరి: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసుకునేందుకు అందరు కలిసికట్టుగా ముందుకు రావాలని సూపరింటెండెంట్ రామస్వామి పిలుపునిచ్చారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రత్యేకాధికారుల అధ్యక్షతన శుక్రవారం ఉపాధి హామీ పథకంపై గ్రామసభలు నిర్వహించారు.

వెల్దుర్తి మండలంలో

వెల్దుర్తి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రత్యేకాధికారుల అధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. వెల్దుర్తిలో గ్రామ సర్పంచ్ ముత్యాల శైలజ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు దాదిపోగు సుంకన్న పాల్గొని మాట్లాడారు.

హొళగుంద: గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకునేందుకు ప్రతిఒక్కరూ భాగస్వామ్యులు కావాలని డీఎల్‌డీఓ నాగేంద్రప్రసాద్, ఎంపీడీఓ సుహాసిని, ఇతర శాఖల అధికారులు పిలుపునిచ్చారు. శుక్రవారం హొళగుందలో జరిగిన సభలో ఆయన పాల్గొన్నారు. ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో గ్రామసభలు జరిగాయి.

హాలహర్వి: గ్రామాల్లో జరిగే గ్రామసభల ద్వారా ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ నజ్మభాను, ఎస్ఐ చంద్ర, సర్పంచ్ మల్లికార్జున పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచుల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు.

దేవనకొండ: మండలంలోని అన్ని గ్రామాల్లో మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి ఎం.నరసారావు, రైతుసంఘం మండల గౌరవాధ్యక్షుడు వై.కందప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం మండల వ్యాప్తంగా నిర్వహించిన గ్రామసభల సందర్భంగా సీపీఐ ఆధ్వర్యంలో నల్లచెలిమల, గుడిమిరాళ్ల, పి.కోటకొండ, కరివేముల, పాలకుర్తి, కుంకనూరు, దేవనకొండ గ్రామ సభల్లో అధికారులకు వినతి పత్రాలు అందించారు.

వేడుకగా విగ్రహ ప్రతిష్ఠాపన





మారెమ్మవ్వదేవి నూతన విగ్ర హాన్ని ప్రతిష్ఠించిన దృశ్యం | ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామివారు

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామంలో శుక్రవారం నూతన మారెమ్మదేవి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి గంగపూజ, పంచామృతాభిషేకం తదితర విశేష పూజలు జరిపించారు. గ్రామంలో ప్రతియేటా మూడో శ్రావణ శుక్రవారం శ్రీ లక్ష్మమ్మవ్వదేవి, ఆంజనేయస్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు. భక్తులు భారీగా తరలివచ్చి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.